ప్రజాశక్తి

బుధవారం 31 మే 2023 8 పేజీలు




ప్రకాశం బాపట్ల

పిడుగుల వాన

- ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో గాలివాన బీభత్సం
- వేర్వేరు చోట్ల పిడుగులు పడి ముగ్గురు మృతి
- ఒకరికి తీవ్రగాయాలు
- మార్టూరులో వాగులో కొట్టుకుపోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు
- ఒంగోలులో ప్రధాన రహదారులన్నీ జలమయం

రోహిణి కార్తె ఎండల సమయంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు చోట్ల మంగళవారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. గాలివాన బీభత్సం సృష్టించగా.. పలుచోట్ల పిడుగులు పడి.. ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మార్టూరులో వాగులో బైక్‌తో సహా ఓ వ్యక్తి కొట్టుకుపోగా పోలీసులు కాపాడారు. ఒంగోలులోనూ భారీవర్షం కురవడంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.




పిడుగుపాటుకు ఒంగోలులో మృతిచెందిన రాము, గొర్రెలు, కుక్క



చదలవాడలో మృతిచెందిన వెంకటరమణ



మార్టూరులో పిడుగుపడటంతో దెబ్బతిన్న బైక్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం, మార్టూరు రూరల్, నాగులుప్పలపాడు

పిడుగుపడి ఓ వ్యక్తితో పాటు రెండు మేకలు, కుక్క మృతిచెందిన ఘటన మంగళవారం ఒంగోలు నగర శివారులోని దామచర్ల కాలనీ ప్రాంతంలో చోటుచేసుకుంది. నగరంలోని విరాట్‌నగర్‌కు చెందిన పి.రాము(60) దామచర్ల కాలనీ శివారులో మేకలు కాస్తుంటాడు. వర్షం వస్తుండటంతో చెట్టు కిందకు మేకలతో పాటు అతనూ వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ పిడుగు పడటంతో రాము ▶ 2లో

ఏసీబీ వలలో పొన్నపల్లి విఆర్‌ఒ

రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

పొలాన్ని ఆన్‌లైన్‌లోకి ఎక్కించేందుకు లంచం తీసుకుంటుండగా పొన్నపల్లి గ్రామ విఆర్‌ఒను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన మంగళవారం మండలంలోని పొన్నపల్లిలో జరిగింది. ఏసీబీ డీఎస్పీలు టీవీవీ ప్రతాప్‌కుమార్, సత్యానందం తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని గుల్లపల్లి గ్రామానికి చెందిన వాగు వెంకటసుబ్బమ్మ, ▶ 2లో



పట్టుబడ్డ విఆర్‌ఒ

నాలుగేళ్లూ సంక్షేమ ఎజెండానే.!

- ఐదో ఏడాదిలోకి అడుగు..
- నత్తనడకన వెలిగొండ ప్రాజెక్టు పనులు
- ఎండమావులుగా పారిశ్రామిక వాడలు
- వైసిపిలో తెరపైకి అసంతృప్తుల కుంపట్లు



సిఎం జగన్ పాలన నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి ప్రభుత్వం పాలనకు నాలుగేళ్లు నిండాయి. ఐదో ఏడాదిలోకి అడుగుపెట్టింది. సంబరాలు చేసుకుంటున్నారు. ఎన్నికల ఏడాదిలోకి అడుగుపెట్టామనే ఆలోచనతోనే ఉన్నారు. రాజకీయ పార్టీల్లో ఇదే వాతావరణం వచ్చింది. ఇప్పటికే పార్టీల నడుమ ఆరోపణల యుద్ధం సాగుతోంది. వ్యూహప్రతివ్యూహాలూ మొదలయ్యాయి. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా సిద్ధమన్నట్లుగా నేతలూ సన్నద్ధంలోనే ఉన్నారు. ఇక నాలుగేళ్ల పాలనా ప్రస్థానం అంతా సంక్షేమ ఎజెండాతోనే సాగింది. అభివృద్ధి పనులు లేవనే చెప్పాలి. మౌలిక సదుపాయాలపైనా నిధుల కేటాయింపులు లేవు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలు పేరుతో అమలులో ఉన్న సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించడం పెద్ద ఎజెండాగా మారింది. ఆర్థిక ఇబ్బందుల్లోనూ వీటిని కొనసాగించారు. నాలుగేళ్లలో జిల్లాలోని లబ్ధిదారులకు రాష్ట్రస్థాయి గణాంకాలను బట్టి చూస్తే సుమారు రూ.10 వేల కోట్లు వివిధ పథకాల కింద లబ్దిదారులకు జమఅయినట్లు తెలుస్తోంది. ఇవే పెద్ద కేటాయింపులుగా ఉన్నాయి. మిగతా అంశాలను ప్రాధాన్యత లేకుండా పోయింది. ఈ ఐదేళ్లూ సంక్షేమ ఎజెండాతో వెళితే ఎన్నికల్లో గెలుస్తామనే ధీమాలోనే వైసిపి నేతలున్నారు. అధిష్టానం నుంచి దిగువస్థాయి నేతల వరకూ ఇదే భావనలో ▶ 2లో

నాలుగేళ్లూ సంక్షేమ ఎజెండానే.!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. కొత్తగా తెచ్చిన సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థల ఫలితాలు, ఫలాలు ఎంత మేరకు ఉన్నాయనేదీ అంచనాలో ఉన్నారు. పాలనావ్యవస్థలో ఎన్ని మార్పులు వచ్చినా ఆ ప్రభుత్వం ఎజెండానే కనిపిస్తోంది. సంక్షేమ పథకాల అమలులోనే ఈ వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోంది. మిగతా సమస్యలపై పెద్దగా దృష్టి సారించలేదు. క్షేత్రస్థాయిలో ఇతర సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇక అభివృద్ధి విషయానికి వస్తే ఏమీ కనిపించడం లేదు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతోంది. ఎన్నికలకు ముందు ఏడాదిలో వెలిగొండ ప్రారంభిస్తామన్నారు.

అధికారంలోకి వచ్చాక ఏటా గడువు నిర్ణయించడం తప్ప దాన్ని పూర్తిచేసి నీళ్లివ్వాలనే ఆలోచనలో చిత్తశుద్ధి లేదు. ఫలితంగానే నాలుగేళ్లు అదే తీరున ఉంది. అక్టోబరులో ప్రారంభం గడువు పెట్టారు. అప్పటివరకూ చూద్దాం. నిర్వాసితులకు పరిహారాలు, ప్యాకేజీలు, పునరావాసం కల్పించాలి. ఇదే పెద్ద ఎజెండాగా ఉంది. నిధులు లేకనే ఇది నత్తనకడన సాగుతుందని చెప్పడంలో సందేహం లేదు. మిగతా ప్రాజెక్టుల విషయానికి వస్తే గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణ లోపంతో గేట్లు దెబ్బతినిపోయాయి. ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏమిటో ఇక్కడే తేలింది.

ఇతర అంశాలపై వాస్తవంగానూ దృష్టి పెట్టలేదు. పర్యవేక్షణ లేదు. నిర్వహణ నిర్వీర్యమైంది. ఉపాధి రంగాల విషయానికి వస్తే దొనకొండ, కనిగిరి సెజ్‌లు ఎండమావులుగా మిగిలాయి. ఒక్క పరిశ్రమ రాలేదు. సోలార్ ప్రాజెక్టులను తెరపైకి తెచ్చారు. ఇవీ అతీగతీ లేవు. ఒక్క పారిశ్రామికవేత్త కూడా జిల్లాకు రాలేదు. వారికి తగిన ప్రోత్సాహకాలూ లేవు. గ్రానైట్ రంగమే మిగిలింది. కరోనా తర్వాత ఎగుమతులు లేక ఇదీ సంక్షోభంలో ఉంది. ఏడాది క్రితం చేపట్టిన జిల్లా విభజన హేతుబద్ధంగా జరగలేదు. పాలనా సౌలభ్యం అనే పేరుతో జిల్లాలను ఏర్పాటు చేశారు. ఈ లక్ష్యం నెరవేరలేదు. పార్టీలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జరగలేదు. దూరంగా ఉన్న ప్రాంతాలకు ఏ మేలు లేకపోగా.. జిల్లా కేంద్రాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు దూరమయ్యాయి. జిల్లా విభజన వల్ల రామాయపట్నం పోర్టు కూడా నెల్లూరు జిల్లాకు చేరింది. బలవంతంగానే విభజన జరిగింది. ప్రజల మధ్య దూరాలను పెంచారు.

జిల్లా విభజన ఎవరూ కోరలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అనే మాటతో జిల్లాలను ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా చీల్చేశారు. మార్కాపురం జిల్లా అనేది తెరపైకి వచ్చింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇక పాలన వల్ల ప్రజల కన్నా వైసిపి క్యాడర్, నేతలు అసంతృప్తిగా ఉన్నారు. ఆర్థిక వనరులు లేవు. పనులు, కాంట్రాక్టులు లేక పార్టీ క్యాడర్ నిరుత్సాహంలో ఉంది. అందరూ నైరాశ్యంతోనే ఉన్నారు. గడపగడపకూ కార్యక్రమంలోనూ బలవంతంగానే తిరుగుతున్నారు. స్థానికసంస్థల్లో చేసిన పనులకు బిల్లులు రాలేదు. ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్లాలంటేనే వెనకాడుతున్నారు. అసంతృప్తులు తీవ్రస్థాయిలోనే ఉన్నాయి.

జిల్లా నేతల మధ్య ఐక్యత లేదు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అధిష్టానంలో కొందరు పెద్దలంటూ ఆయన సమీప బంధువుపైనే ఇటీవలే చేసిన ఆరోపణలు పార్టీలో దుమారం రేపాయి. జిల్లా నేతల మధ్య కూడా సమన్వయ లోపానికి దారితీసింది. ఏ విషయంలోనూ సమన్వయం లేదు. జిల్లాకు ప్రాజెక్టులు సాధించడంలోనూ, నిధులు తేవడంలోనూ సమగ్ర విధానం, వ్యూహం లేదు.

ఎవరిదారి వారిదే అయ్యింది. పార్టీలో గ్రూపుల పోరు ఎక్కువగానే ఉంది. ఈ తరుణంలో అధికార యంత్రాంగాన్ని నడిపించడంలోనూ సమర్థత ప్రశ్నార్థకమైంది. ఎమ్మెల్సీ ఎన్నికలు పాలకపక్షానికి గుణపాఠంగా మిగిలాయి. ఏదేమైనా నాలుగేళ్ల ప్రస్థానంలో సంక్షేమ పథకాలు తప్ప మిగతా అంశాలకు ప్రాధాన్యత లేదు. పార్టీలో పరిస్థితి ఎలా ఉందో సంబరాలను బట్టే తెలుస్తోంది. మొక్కుబడిగా నాలుగేళ్ల సంబరాలు కనిపిస్తున్నాయి. ఇదో ఏడాది సవాళ్లతోనే సాగాల్సి ఉంది. ఎన్నికలను ఎదుర్కోవడం ప్రధాన ఎజెండాగా పార్టీల ముందుంది.

పిడుగుల వాన..

(మొదటిపేజీ తరువాయి)

మృతిచెందాడు. రెండు మేకలు, పెంపుడు కుక్క కూడా మృత్యువాతపడ్డాయి. మరో పది గొర్రెలు కనబడటం లేదని బంధువులు తెలిపారు.

మహిళ మృతి

పిడుగుపాటుకు మహిళ మృతిచెందిన సంఘటన మంగళవారం నాగులుప్పలపాడు మండలం, చదలవాడ గ్రామంలో జరిగింది. చదలవాడకు చెందిన ఎద్దు వెంకట రమణ(46) అనే మహిళ మంగళవారం గొర్రెలను మేపుకునేందుకు అగ్రహారం పొలాల్లోకి వెళ్లింది. వర్షం కురుస్తుండటంతో ఆమె ఓ చెట్టు సమీపంలోకి వెళ్లగా ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మతిచెందింది. ఆమె భర్త పోతురాజు ఇటీవలే మృతిచెందాడు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. సమాచారం తెలుసుకున్న ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎన్.జయలక్ష్మి, ఎస్ఐ ఉయ్యాల హరిబాబు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ద్విచక్రవాహనంపై పిడుగు..

ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై పిడుగుపడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మతి చెందాడు. మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మార్టూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రామ్ జనార్ధన్ కాలనీలో నివాసముంటున్న రాచగిరి వెంకటస్వామి(39) గుడిలో పూజలు నిర్వహిస్తుంటాడు. మంగళవారం బల్లికురవలో జరిగిన ఓ కార్యక్రమంలో స్థానికంగా నివాసముండే పోలేశ్వరరావుతో కలిసి హాజరై.. తిరిగి తమ బుల్లెట్ బండిపై మార్టూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న బైక్ నాగరాజుపల్లి గ్రామ సమీపంలోకి రాగానే పిడుగు పడింది. దీంతో బైక్‌పై కూర్చొని ఉన్న వెంకటస్వామి ఒక్కసారిగా షాక్‌కి గురై అక్కడికక్కడే కుప్పకూలి.. మృతిచెందాడు. బైక్ నడుపుతున్న పోలేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. పోలేశ్వరరావును మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

బైక్‌తో సహా కొట్టుకుపోయిన వ్యక్తి


పోలీసులు కాపాడిన వీరాంజనేయులు

భారీవర్షం కారణంగా మార్టూరు – యద్దనపూడి మధ్య గల చప్టాపై ఉధతంగా వర్షపునీరు ప్రవహిస్తోంది. చప్టా దాటాలని పర్చూరు మండలం, బోడవాడ గ్రామానికి చెందిన కూనంనేని వీరాంజనేయులు ప్రయత్నించగా బైక్ సహా కొట్టుకు పోయాడు. వాగు మధ్యలో ఉన్న చెట్టు కొమ్మలు పట్టుకొని బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. రంగంలోకి దిగిన మార్టూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ షేక్ థెరిసా ఫిరోజ్ తమ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. రెండు గంటలు శ్రమించి నీటిలో చిక్కుకుపోయిన వ్యక్తిని తాళ్ల సహాయంతో బయటకు తీశారు. ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

పిసిపల్లి: పిసిపల్లిలో టిడిపి జెండా దిమ్మెపై పిడుగు పడటంతో దిమ్మె ధ్వంసమైంది. మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. నిత్యం దిమ్మెపై జనం కూర్చొని ఉండేవారు. మంగళవారం పిడుగు పడే సమయంలో ఆ దిమ్మెపై ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

కొండపి: కొండపి మండలంలో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొండపి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న జాళ్లపాలెం ఫీడర్‌లో పెద్దకండ్లగుంట వద్ద 11కెవి పోల్ విరిగిపోవడంతో పెద్దకండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే విద్యుత్ శాఖ ఏఈ కుంచాల కోటయ్య ఘటనాస్థలానికి చేరుకొని సిబ్బందితో పునరుద్ధరించారు.

ఏసీబీ వలలో పొన్నపల్లి విఆర్‌ఒ

(మొదటిపేజీ తరువాయి)

ఆమె మనమరాలు కొల్లిపర లీలకు చెందిన ఒకటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి పొన్నపల్లి గ్రామ పరిధిలో ఉంది. పొలానికి సంబంధించి మ్యూటేషన్‌కు ఈ నెల 24న దరఖాస్తు చేయగా వీఆర్వో నీలం స్వాతి రూ.20 వేల లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలి మనువడు వాగు దినేష్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారి సూచనల మేరకు రూ.18 వేల నగదును మంగళవారం గ్రామ సచివాలయంలో వీఆర్వో నీలం స్వాతికి అందజేస్తుంగా.. వెంటనే ఏసీబి అధికారులు దాడి చేసి.. పట్టుకున్నారు. విఆర్‌ఒపై కేసు నమోదు చేసినట్లు గుంటూరు ఏసీబీ డీఎస్పీలు టీవీవీ ప్రతాప్‌కుమార్, సత్యానందం తెలిపారు. కార్యక్రమంలో ఏసీబీ సిఐ హరిబాబు, తహశీల్దార్ డి.మల్లికార్జునరావు, డిప్యూటీ తహశీల్దార్ టి.నిరంజన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ఒంగోలు సబర్బన్ : నగరంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయాలని ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి సూచించారు. ఒడా ఆధ్వర్యంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. ట్యాంకులను ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు.

భూసర్వే పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంలో భాగంగా నగరంలోని ఎబిఎం కాలేజీ గ్రౌండ్‌లో ఎంఎస్ బ్రాని సర్వీసెస్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రోన్ సర్వేను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా అందుబాటులో ఉన్న లేటెస్ట్ టెక్నాలజీని ఉపయోగించుకొని మొత్తం భూమిని ఖచ్చితత్వంతో రీ సర్వే చేసి ల్యాండ్ రికార్డులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఎ ఈ సర్వే పనులు నగరంలో మరో పదిరోజులు జరుగుతాయని తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన....

పారిశుధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు త్రోవగుంట సచివాలయం పరిధిలో పర్యటించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి పారిశుధ్య పనులు గురించి అడిగితెలుసుకున్నారు. రోడ్లకు రెండు వైపుల మొలచిన పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మిరియం శ్రీను, శానిటరీ మేస్త్రీలులున్నారు.


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్

సక్రమంగా జగనన్న పాలవెల్లువ: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమూల్ పాల కేంద్రాల ద్వారా అధికంగా పాలసేకరణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో పాలసేకరణకు 38 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల 21 కేంద్రాలు పని చేయడం లేదని, పనిచేయని కేంద్రాలపై ప్రభుత్వానికి నివేదికను ఇస్తామన్నారు. జిల్లాలో ఆమూల్ ద్వారా పాల సేకరణకు కొత్తగా 97 కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాటిని ప్రారంభించడానికి అవస రమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం కింద సేకరణ చేస్తున్న గ్రామాల్లో రైతులకు జులై నెలలో డిఆర్‌డిఎ ద్వారా పాడి గేదెలు ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, జిల్లా సహకార శాఖ అధికారి రామారావు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, అమూల్ సంస్థ ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి నాంచారమ్మ శిడిమహోత్సవం

ప్రజాశక్తి-పర్చూరు

అద్దంకి నాంచారమ్మ శిడిమహోత్సవం అత్యంత వైభవోపేతంగా మంగళవారం పర్చూరులో జరిగింది. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇఓ శ్రీనివాసరావు, అర్చకులు తులసి వారు, పెద్దకాపు కొల్లా సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ చెంచు ప్రసాదు బందోబస్తు నిర్వహించారు.

బాలికల కళాశాల ఏర్పాటు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూలు ప్లస్‌గా చేస్తూ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపిసి, బైపిసి గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. అధ్యాపకుల నియామకం జరిగిందన్నారు. ఇంకొల్లు పరిసర బాలికలు అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీనివాసరావు కోరారు.



ఆలయంలో పర్యటిస్తున్న జెసి శ్రీధర్

దేవాలయాలను సందర్శించిన జెసి

ప్రజాశక్తి-వేటపాలెం

మోటుపల్లి చారిత్రక దేవాలయాలైన వీరభద్రస్వామి, కోదండ రామాలయాలను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ మంగళవారం సందర్శించారు. ముందుగా వేటపాలెం మండలంలోని అక్కయ్యపాలెం పంచాయతీ రామాపురం సముద్ర తీర ప్రాంతంలో పుల్లరపాలెం పంచాయతీ రామచంద్రపురం సముద్ర కరాకున ఉన్న ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. సముద్ర ప్రాంతాలకు దగ్గరగా ఉండే స్థలాలలో హైకోర్టు జడ్జి గెస్ట్ హౌస్ నిర్మాణానికి స్థల సేకరణలో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది. రామాపురం సముద్ర తీర ప్రాంతంలోని సర్వే నంబర్ 332/2లో ఉన్న 39 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. రామచంద్రపురం గ్రామంలోని సర్వే నంబర్ 230/1లో ఉన్న నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తీర ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడంలో భాగంగా సాధారణ పరిశీలన చేపట్టినట్లు చెప్పారు. అనంతరం చిన్నగంజాం మండలం మోటుపల్లి గ్రామంలో ఉన్న చారిత్రక దేవాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డిఓ సరోజినీదేవి, వేటపాలెం, చిన్నగంజాం తహశీల్దార్లు జి మహేశ్వరి, పి పార్వతి, మండల సర్వేయర్ సాయి కృష్ణ, వీఆర్వో కృష్ణవేణి పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం ● రెండు కుటుంబాల్లో విషాదం

ప్రజాశక్తి-పెద్దారవీడు

ఆ ఇద్దరూ ప్రాణ స్నేహితులు.. ప్రతి పనినీ కలిసే చేసేవారు. ఎక్కడికైనా కలిసి వెళ్లేవారు. చదువులోనూ, ఆటల్లోనూ వారిద్దరిదీ విడదీయరాని బంధం.. చివరికి మృత్యువులోనూ వారిద్దరి స్నేహం వీడలేదు.. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్నేహితులిద్దరూ మృతి చెందారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. మండల కేంద్రమైన పెద్దారవీడు గ్రామానికి చెందిన లక్కాకుల రజనీకాంత్(14), కాయకాకుల అనేష్(14) ఇద్దరూ స్నేహితులు. లక్కాకుల రజనీకాంత్ మార్కాపురం పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కాయకాకుల అనేష్ పెద్దారవీడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరి నివాసాలు పెద్దారవీడులో ఒకే వీధిలో ఉన్నందున్న చిన్న నాటి నుంచి స్నేహంగా మెలిగేవారు. లక్కాకుల రజనీకాంత్ అవ్వా తాతల స్వగ్రామం ఇదే మండలంలోని రామాయపాలెం కాగా... అక్కడ నుంచి బియ్యం తీసుకువచ్చేందుకు పెద్దారవీడు నుంచి మోటార్ సైకిల్‌పై కాయకాకుల అనేష్‌తో ఉదయం బయలుదేరారు. రామాయపాలెం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దారవీడు సమీపంలోని అంకాళమ్మ దేవస్థానం సమీపంలో గల మూల మలుపు వద్దకు రాగానే లారీ ఎదురు పడింది. మలుపు కావడంతో మోటార్ సైకిల్‌ను నియంత్రించలేకపోయారు. దీంతో ఎదురుగా వచ్చిన లారీని ఢీకొట్టారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు జరిగిన ప్రమాదాన్ని 108 అంబులెన్స్ వాహనం సిబ్బందికి వివరించారు. అక్కడ నుంచి 108 వాహనంలో మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు క్షతగాత్రులను తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలోని వినుకొండ సమీపంలో మృతి చెందారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం మార్కాపురం లోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు చేర్చారు. ప్రమాద స్థలాన్ని పెద్దారవీడు ఎస్ఐ పులి రాజేష్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన విద్యార్థులు (ఫైల్)



సంఘటనా స్థలం..

గ్రామంలో విషాదం..

విద్యార్థులు లక్కాకుల రజనీకాంత్, కాయకాకుల అనేష్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పెద్దారవీడు గ్రామంలో విషాదం నెలకొంది. లక్కాకుల సుబ్బారావు, మల్లీశ్వరిల ముగ్గురు సంతానంలో ఏకైక కుమారుడు రజనీకాంత్. ఇద్దరు కుమార్తెలతో పాటు రజనీకాంత్‌ను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. కూలి పనులతో వచ్చే సంపాదనతో కుమారుడు రజనీకాంత్‌ను ఉన్నత చదువులు చదివించాలన్న లక్ష్యంతో శ్రీచైతన్య హైస్కూల్‌లో చదివించుకుంటున్నారు. మంగళవారం నాటి రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

కాయకాకుల గంగరాజు, రంగలక్ష్మిలకు ఇద్దరు మగ సంతానం. ఆటోతో జీవనం సాగిస్తున్నాడు. భార్య రంగలక్ష్మి కూడా కూలి పనులతో కుటుంబానికి అండగా నిలిచేంది. కుమారులిద్దరినీ చదించుకుంటున్నారు. రోడ్డు ప్రమాదం రూపంలో పెద్ద కుమారుడు అనేష్ మృతి చెందడంతో తల్లడిల్లుతున్నారు. ప్రమాదంలో కుమారులను కోల్పోయిన రెండు కుటుంబాలు ఒకే ప్రాంతంలో ఉండటంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

గత శనివారం రాత్రి ఇంట్లో జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన చెలరేగిన మంటలలో చిక్కుకున్న ఇంటి యజమానురాలు దొంతు శ్రీదేవి(51) చికిత్స పొందుతూ మృతి చెందింది. గత శనివారం పళ్లపోతు వారి బజారు పక్క సందులో నివాసముంటున్న దొంతు శ్రీదేవి, ఆమె కుమారుడు సాయి తేజ తమ ఇంటిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో చిక్కుకున్న వారిని స్థానికులు రక్షించి ఒంగోలులో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గత శనివారం నుంచి వెంటిలేటర్లపై ఉంచి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించటంతో దొంతు శ్రీదేవి మంగళవారం మృతి చెందింది. ఆమె కుమారుడు సాయి తేజ ఇంకా చికిత్స పొందుతున్నాడు. దొంతు శ్రీదేవి ఒంగోలులోని పిఎఫ్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గత ఐదేళ్ల క్రితం మృతిచెందారు. దొంతు శ్రీదేవి మృతి పట్ల యూటీఎఫ్ చీమకుర్తి మండలశాఖ సంతాపం తెలిపింది.



నియామక పత్రం అందుకుంటున్న అనూష

ఎంపిపిల సంఘం కార్యదర్శిగా అనూష

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఆంధ్రప్రదేశ్ ఎంపిపిల సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శిగా ఇంకొల్లు ఎంపిపి బండారు అనూష ఎంపికయ్యారు. బాపట్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర ఎంపిపిల సంఘం కన్వీనర్ మేకల హనుమంతరావు నుంచి నియామక పత్రాన్ని అనూష అందుకున్నారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-చీరాల

సిఐటియు ఆవిర్భావ దినోత్సవం పేరాల సిఐటియు కార్యాలయంలో చీరాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎం వసంతరావు అధ్యక్షత వహించారు. సిఐటియు నాయకుడు ఎన్ బాబురావు మాట్లాడుతూ సర్వ సంపదలను సృష్టించేది కార్మిక వర్గం దేశాభివద్ధికి మూలం కార్మికులు చెమట చిందించి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అన్ని రంగాల్లో ఉత్పత్తి సాధించారు అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎన్నడూ లేని విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడి చేస్తున్నాయని అన్నారు. జీవితాంతం పనిచేసిన పర్మినెంట్ కాకుండా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్‌తో పని పేరుతో పని చేయిస్తున్నారని, కార్మిక శాఖలు ప్రభుత్వ సంస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి అన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవటానికి యావత్తు కార్మిక వర్గాన్ని పోరాటాలకు సిద్ధం చేయాలని, అదే సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇచ్చే నినాదం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జండా ఆవిష్కరణ సిఐటియు సీనియర్ నాయకులు ఐవి ప్రసాద్ జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్‌విఎస్ రామిరెడ్డి, కే సాల్మన్ రాజు, మోజేష్, చెంచయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చీమకుర్తిలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ



చీమకుర్తిలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సిఐటియు నాయకులు



చీరాలలో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు సీనియర్ నాయకులు ఐవి ప్రసాద్

సిఐటియు 1970 మే 30న ఏర్పడిందని కార్మికుల కోసం నిరంతరం పనిచేస్తూ కార్మిక సంఘాల ఐక్యత కోసం కృషి చేస్తోందని అన్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేశారని విమర్శించారు. నిత్యావసర ధరల పెరుగుదల వల్ల కార్మికుల నిజ వేతనాలు పడిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నారని విమర్శించారు. లక్షలాది చిన్న పరిశ్రమలు సంక్షోభంతో మూతలు పడ్డాయని, కార్మికులు బజారున పడ్డారని అన్నారు కార్మికులు రైతులు కూలీలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని వీటిని పక్కదారి మళ్లించడానికి మతోన్మాదాన్ని ముందుకు తీసుకొచ్చి ప్రజల్లో చీలికలు తీసుకొస్తున్నారని కార్మిక -కర్షక ఐక్యతతో సమస్యలపై పోరాటాలు చేయాలని అన్నారు. సిఐటియు ప్రధాన లక్ష్యం కార్మిక వర్గ రాజ్య స్థాపన. దీనికోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు బి వీరాంజనేయులు జెండా ఆవిష్కరణ చేశారు. మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, సిఐటియు నాయకులు శ్రీను మస్తాన్, శంకరు, వెంకట్రావు, కార్మికులు పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరులో సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్మికుల స్థితిగతులను, జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ముందు నిలబడి పోరాడుతున్న సిఐటియుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో సిఐటియు జెండాను ఆవిష్కరిచారు. కార్యక్రమంలో ఎం డేవిడ్, బి చినదాసు, ఎన్ శ్రీనివాసరెడ్డి, రత్నంరాజు, కె రామారావు, సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్నగంజాం: శ్రామికుల జీవన ప్రమాణాల కోసం, హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్మిస్తున్న కార్మిక సంఘం సిఐటియు అని జిల్లా కార్యదర్శి జి ప్రతాప్ కుమార్ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 53 సంవత్సరాల క్రితం ఏర్పడిన సిఐటియు కార్మిక రంగంలో వస్తున్న పెను సవాళ్లను అధిగమించేందుకు ఐక్య ఉద్యమాలకు సారథ్యం వహిస్తూ సంఘటిత రంగంలోనూ అసంఘటిత రంగంలోనూ కార్మిక పక్షాన విలువైన విజయాలు సాధించిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డి రాఘవులు, శ్రీనివాసరెడ్డి, మస్తాన్, రవితేజ, వెంకటేశ్వర్లుతో బాటు రిక్షా వర్కర్స్ యూనియన్ నాయకులు పుల్లారావు, కృష్ణ, ఆదయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చినగంజాంలో జెండా ఆవిష్కరించిన కార్మికులు



బహుమతులు అందుకుంటున్న కళాకారులు

మానవతా విలువలను చాటిన నాటికలు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ నాటిక పోటీలు మానవతా విలువలను చాటి చెప్పాయి. నటీనటులు తమ నటన ద్వారా అద్భుతమైన ప్రదర్శనలు ప్రదర్శిస్తున్నారు. 7వ జాతీయ స్థాయి పోటీలను చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు రావటంతో కళాప్రాంగణం కిటకిటలాడింది. బహుమతి ప్రదానోత్సవ సభ జరిగింది. సభకు చిట్టినేని సాయిబాబు అధ్యక్షత వహించారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి అతీతం అనే నాటిక ఎంపికై ప్రథమ బహుమతి సాధించింది. హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరి వారి మనసున మనసై ద్వితీయ బహుమతి సాధించింది. పొన్నూరు వారి రసఝరి 'గుర్తుతెలియని శవం' నాటిక తృతీయ ప్రదర్శనగా ఎంపికైంది. న్యాయమూర్తులుగా నుసుము నాగభూషణం, జెట్టి హరిబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో కొల్లా శ్రీనివాసరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు తగదు

ప్రజాశక్తి-సంతమాగులూరు

బాల్య వివాహానికి హాజరైన వారికి కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానాను కోర్టులు విధిస్తాయని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, సిడిపిఓ డి సుధ అధ్యక్షతన జరిగిన బాల్యవివాహాల నిషేధిత చట్టం 2006, జీవో ఎంఎస్ 13పై అద్దంకి నియోజకవర్గ స్థాయిలోని ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక కమిటీలకు చైర్మన్‌లుగా ఉన్న గ్రామ సర్పంచులు బాల్య వివాహాలు జరగకుండా ప్రధాన పాత్ర పోషించాలని అన్నారు. అమ్మాయి వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలని పేరయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో బల్లికురవ ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, సంతమాగులూరు వైస్ ఎంపీపీ హేమలత, ఎంపీడీవో సిహెచ్ కృష్ణ, ఎంఈఓ వి కోటేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాహిత్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఇల్లూరి లక్ష్మీ శేషు, ఏపీఎం మస్తాన్ రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఐసిడిఎస్ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ జండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-రేపల్లె

దేశవ్యాప్తంగా కార్మిక సమస్యలుపై రాజీలేని పోరాటాలుతో ముందుకు సాగుతుందని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 53వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద జండాను సీఐటీయూ రేపల్లె పట్టణ అధ్యక్షుడు జె ధర్మరాజు ఆవిష్కరించారు. ఆనతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మట్లాడుతూ 1970వ సంవత్సరం మే 30న కలకత్తాలో సిఐటియు ఆవిర్భవించింది. 53 సంవత్సరాలుగా కార్మికుల సమస్యల మీద రాజీలేని పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద నిజాయితీగా నిక్కచ్చిగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలు, కార్మిక హక్కులు హరిచటం,రైల్వే బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, డిఫెన్స్, విశాఖ స్టీల్ ప్లాంట్, బ్యాంక్స్ వివిధ రకాల ప్రభుత్వరంగ సంస్థలు అమ్మటం వ్యతిరేకిస్తూ సిఐటియు ఎప్పటికప్పుడు ఆందోళనలు చేస్తున్నది. ఇప్పటివరకు కార్మికుల పక్షాన దేశవ్యాప్తంగా జరిగినా దాదాపు 26 సమ్మెలో సీఐటీయూ అగ్రభాగాన ఉండి నిర్వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు కె ఆశీర్వాదం, కె వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కేసుల్లో..

బాధితులకు సత్వరమే న్యాయం: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులలో బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టరు పి రంజిత్ బాషా ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం నిఘా, పర్యవేక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జరిగింది. బాధిత కుటుంబాలకు సకాలంలో పరిహారం అందించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. చట్టపరంగా పరిహారం చెల్లింపులలో జాప్యం ఉండరాదని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. బాపట్ల జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద 100 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ కేసుల విచారణ సత్వరమే చేపట్టాలన్నారు. సాక్షులు, సాక్ష్యాధారాల పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బాధితులకు న్యాయం జరగడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన చట్టాలు, కల్పించిన హక్కులను పరిరక్షించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం రూపొందించిన చట్టాలు బాధితులకు అండగా ఉంటాయనే భరోసా కల్పించాలన్నారు. 2011 నుంచి బాపట్ల జిల్లా పరిధిలోని మండలాలలో 73 కేసులు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. డివిజన్ల వారీగా ఆర్డీవోలు, డీఎస్పీలతో క్షుణ్ణంగా సమీక్షించారు. వాటి పూర్వపరాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. చార్జిషీటు దాఖలు చేయడంలో నిబంధనలు పాటించాలన్నారు. కేసులలో పురోగతి సాధించడానికి డివిజన్ స్థాయిలో ఆర్‌డిఓలు ప్రతి నెల ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. బాధితులకు పరిహారం అందడంలోనూ కులధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో నిబంధనలు అనుసరించాలన్నారు. అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో రాజీపడే వాటిపై అధికారులు నిశిత పరిశీలన చేయాలని కలెక్టరు పి రంజిత్ బాషా తెలిపారు. బాధితులను ప్రలోభపెట్టే అవకాశం ఉన్నందున రాజీ కేసులను పున్ణపరిశీలించాలన్నారు. ప్రతి నెలలో ఒకరోజు అన్ని మండలాలలో పౌరహక్కుల దినోత్సవం విధిగా నిర్వహించాలన్నారు. బాపట్ల జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేటికి ఆధార్ కార్డులు లేని ఎస్‌సి, ఎస్‌టిల కోసం మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. బాపట్ల మండలంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి సమావేశానికి సమగ్ర వివరాలతో అధికారులు హాజరు కావాలని పలు సూచనలు చేశారు. కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టరు దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, డిఆర్‌ఓ కె లక్ష్మీశివజ్యోతి, ఆర్‌డిఓలు, జి రవీంద్ర, పార్థసారథి, పి సరోజిని, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జె రాజదెబోరా, డిఎస్‌పిలు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం నిఘా, పర్యవేక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

అలరిస్తున్న పల్లెకోన నాటికలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో ఎన్టీఆర్ కళాప్రాంగణంలో కొనసాగుతున్న పరుచూరి రఘుబాబు స్మారక 31వ అఖిల భారత నాటక పోటీలు ప్రేక్షకులకు అలరింప చేస్తున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలు మంగళవారం మూడో రోజు కొనసాగాయి. ముందుగా విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'సిరి మింగిన వెలగపండు' అనే నాటిక ప్రదర్శించబడింది. ప్రజాస్వామ్యంలో రాజకీయం, పరిపాలన, న్యాయస్థానాలు, జర్నలిజం అనే నాలుగు స్తంభాలు. కానీ నేడు ఈ నాలుగు డబ్బుకు దాసోహమై సమాజాన్ని భిన్నాభిన్నం చేస్తున్నాయి. స్వతంత్ర భారత దేశంలో ఓ పోలీస్ అధికారి రాజకీయ నాయకుడికి బానిసై అతను చెప్పుచేతల్లో డబ్బుకు లాగి జైలు పాలై జీవితాన్ని ముగించుకున్న వ్యక్తి గాథ. వెలగ పండును ఏనుగు మింగి వదిలిన తరువాత దానిని పగుల కొడితే లోపల ఏమి ఉండదు. అదే రీతిలో నేటి సమాజ వ్యవస్థ సిరిమింగిన వెలగపండులా కనిపిస్తుందని కథ సారాంశం. రచన శ్రీశైలమూర్తి, దర్శకత్వం మోహన్ సేనాపతి రూపకల్పనలో కొనసాగింది. అలాగే అభయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రపస్థ నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. ప్రతి మనిషి జీవితం అందంగా, ఆదర్శంగా ఎదగాలంటే అందుకు చేయూతనందించేది నాన్న నాన్న లేని కుటుంబం అంధకారంగా ఉంటుంది. చెయ్యిచ్చి పైకి లేపేది నాన్నే. ఆలాంటి తండ్రి గాదె ఈ ఇంద్ర ప్రస్థానం నాటిక. కాగా ఈ పోటీలను పరుచూరి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమం ఆద్యంతం వ్యాఖ్యాతగా తెనాలికి చెందిన ఐనాల మల్లేశ్వరరావు వ్యవహరించారు.



'సిరిమింగిన వెలగపండు' నాటికలో సన్నివేశం

ఏం ఒరగబెట్టారని సంబరాలు?

ప్రజాశక్తి-అద్దంకి

రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో ఏం ఒరగబెట్టారని సంబరాలు చేసుకుంటున్నారని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, దీనిపై ప్రజలే తిరగబడే రోజు వచ్చిందని అన్నారు. తాడేపల్లి ప్యాలస్‌లో కూర్చుని బటన్ నొక్కటం అభివృద్ధి కాదని ఎద్దేవా చేశారు. ప్రజలే బటన్ నొక్కి తాడేపల్లి ప్యాలెస్‌లో పర్మినెంట్‌గా కూర్చోబెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. పేదలకు అన్నం పెట్టే పథకాలను రద్దు చేశారని అన్నారు. నవరత్నాల పేరుతో నవమోసాలకు తెగబడ్డారని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేస్తున్న జగన్‌రెడ్డి స్థానిక తెలుగుదేశంపార్టీ నేతలతో మాట్లాడుతూ వైసిపి నాలుగేళ్ల పాలనంతా మోసపూరితమయ మని, తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి, సంక్షేమంపై పచ్చి అబద్ధాలు చెబుతూ, ప్రజల సొమ్ముతో తనసొంత మీడియాలో బూటకపు ప్రకటనలు చేయిస్తూ, దళితులు, గిరిజనులు, బీసీ, మైనారిటీ వర్గాలను మోసం చేస్తున్నాడని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వైసిపి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గుల చేతికి పాలన అందితే.. ఆ రాజ్యం అంతా అశాంతిమయమని జగన్ పాలన రుజువు చేస్తోందన్నారు. నాలుగేళ్ల పాలనంతా అరాచకాలు, అకృత్యాలే అని ఆయన విమర్శించారు.

హామీలు పరిష్కరించకపోతే పోరాటం

వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర నాయకులు కర్నూలు అంజి

ప్రజాశకి-బాపట్ల

నాటి ప్రతిపక్ష నాయకుడు, నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర నాయకులు కర్నూలు అంజి అన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా సిపిఎం, ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన జిల్లా వీఆర్‌ఏల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మౌలాబి అధ్యక్షత వహించారు. అంజి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో గ్రామ సేవకులు సమస్యల పరిష్కరించాలని విజయవాడ అలంకార్ సెంటర్లో దీక్షలు చేస్తున్న సందర్భంగా అప్పటి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి మీకు నేనున్నాను. నేను విన్నాను. ఖచ్చితంగా ప్రభుత్వం వచ్చిన వారంలోపే గ్రామ సేవకులకు రూ.15 వేలు వేతనం పెంచుతానని, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా వీఆర్‌ఏల సమస్యలు ఒకటి కూడా పరిష్కరించకపోగా ఉన్న జీవోలోనే కోత పెడుతున్నారన్నారు. నామినీగా ఎన్నో యేళ్ల నుంచి పనిచేస్తున్నా రెగ్యులర్ కాకపోవడం, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయలేదు. అర్హులైన వారికి ప్రమోషన్ లేక అయోమయం పరిస్థితిలో వీఆర్‌ఏలు ఉన్నారన్నారు. జిల్లా సీఐటీయూ కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం జిల్లా కన్వీనరు గోపయ్య, కో కన్వీనరుగా ఎం వెంకటేశ్వరావును ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పనులు లేని సమయంలో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు చేసే కూలీలకు కనీస వేతనం రూ.600 వచ్చేలా చర్యలు చేపట్టాలని, ఆన్‌లైన్ ఫోటో విధానాన్ని ఎత్తివేసి, ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నేతలు డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లాలో ఈ ఏడాది ప్రారంభంలో కోటి పనిదినాలు కల్పించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కాని ఆచరణలో 73 లక్షల పనిదినాలకే పరిమితం అయ్యారు. జిల్లాలో 2.56 లక్షల జాబ్ కార్డులు ఉండగా ఇందులో 2 లక్షల కార్డుల వరకు మనుగడలో ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా 4.56 లక్షల మంది ఉపాధి కూలీలు ఉండగా ఈ సీజన్‌లో 3.50 లక్షల మంది పనులకు వస్తున్నట్లు తెలుస్తుంది. ఎండలు అధికంగా ఉండడం పని ప్రదేశాలు దూరంగా ఉన్న కారణంగా పనులు ముందుకు సాగక రోజు కూలి రూ.230కి మించడం లేదు. ఉదయం నుంచే అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉపాధి పనులకు హాజరవుతున్న వారు ఎక్కువ సమయం పని చేయలేని పరిస్థితులున్నాయి. అలానే పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. గతంలో పనికి వచ్చే కూలీల కోసం ఎండల నుంచి రక్షణ కోసం టార్పాలిన్ పట్టలు ఇచ్చేవారు. తాగునీటితో పాటు, మజ్జిగ ఇచ్చేవారు. పనిముట్లు ఉపయోగించే వారికి అదనంగా కూలి ఇచ్చేవారు. ప్రథమ చికిత్స కిట్లు ఇచ్చేవారు. కాని ప్రస్తుతం ఇవేవీ లేవు. తాగునీరు కూడా కూలీలే తెచ్చుకుంటున్న దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని, మేట్లకు పారితోషకం ఇవ్వాలని, ప్రతి జాబ్ కార్డుకు వంద రోజులు తగ్గకుండా పని ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 5వ తేదీ బాపట్ల కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మోండ్రు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్‌లు తెలిపారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఒంగోలు నగరపాలక సంస్థ ఒకటో మస్టర్ పాయింట్ వద్ద సిఐటియు జెండాను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మంగళవారం ఎగుర వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు పనిచేస్తోందన్నారు. కార్మికులకు అండగా సిఐటియు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులను తొలగిస్తున్నట్లు అనే ఉదంతాలు వస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఏ ఒక్క కార్మికుడిని తొలగించిన సహించబోమని స్పష్టం చేశారు. చనిపోయిన కార్మికులకు బదులుగా వారి కుటుంబసభ్యులకు పనిచేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కార్మికులకు వేతన సవరణ



మార్కాపురంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఒంగోలులో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు



పొదిలిలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు , నాయకులు

చేయాలని కోరారు. నగరంలో కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కార్మికులపై పని భారం తగ్గించాలని సూచించారు. 60 ఏళ్ల నిండి పని నుంచి తొలగించిన కార్మికులకు రెడిమెడ్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. వారి కుటుంబసభ్యులకు పనిచేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు, సిహెచ్.అక్కేశ్వరరావు, పి పద్మ, తదితరులు పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్ :** సిఐటియు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని యూనియన్ సీనియర్ నాయకులు జిపి.తిరుమలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫీ మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాలకు రథసారధిగా సిఐటియు ఉందన్నారు. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు కె. సుబ్బరాయుడు, జి.హరి, జిపి.తిరుమలయ్య, షేక్ హిమంసా, చెన్నకేశవులు, అల్లూరయ్య,పి.సలాం ఖాన్, బ్రహ్మం, రమణ, శ్రీను, నాసరయ్య పాల్గొన్నారు. **పొదిలి :** ఐక్య పోరాటాలతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక,కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్ అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సివిల్ సప్లై,నగర పంచాయతీ కార్యాలయాల వద్ద జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఐక్యత పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియు కార్మికవర్గంలో ఐక్యపోరాటాలకు నిరంతరం కషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.కోటెశ్వరావు,నాయకులుకె.శేషయ్య,కె.ప్రసాద్,డి.దర్మయ్య,ఎస్.వెంకటయ్య,జి.నాగులు,కెవి.నరసింహం పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కేశవరావు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని సూరాపాపిరెడ్డినగర్ ప్రాంతంలోని సర్వేనెం 894లోని ఎనిమిదిన్నర ఎకరాల వాగు పోరంబోకు భూమిని కనిగిరి వ్యవసాయమార్కెట్ చెక్‌పోస్టులో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న బలసాని బెంజిమెన్ అతని సోదరులు రూబెన్,కోటేశ్వరరావు ఆక్రమించినట్లు ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి. కేశవరావు తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్రమిత స్థలంలో ఆక్రమణదారులు



మాట్లాడుతున్న పిసి కేశవరావు

ప్లాట్లు వేసి పేదలకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషాయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించులేదన్నారు. దీంతో ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డుకట్టులేకుండా పోతుందన్నారు. ఆక్రమణదారులు ఆక్రమిత స్థలాల్లో గృహ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆర్‌డిఒ దృష్టికి తీసుకుపోగా ఆక్రమణదారులపై చర్యలుచేపట్టాలని కమిషనర్‌ను ఆయన ఆదేశించినట్లు తెలిపారు. అయినప్పటికీ మున్సిపల్ కమిషనర్ ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయలేదన్నారు. అక్రమిత స్థలంలో బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఆక్రమణదారులపై క్రిమినల్,సివిల్ చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు షేక్ బషీరా, ఏడుకొండలు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం...

ప్రభుత్వ ఉద్యోగులంతా ఏకం కావాలి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగులంతా ఏకం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మార్కాపురం తాలూకా యూనిట్ అధ్యక్షుడు కొల్లి చెంచిరెడ్డి అధ్యక్షతన మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా సకాలంలో జీతాలు ఇచ్చేలా చట్టం చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన పిఆర్‌సి, డిఎలను సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షా శిబిరంలో సంఘ కోశాధికారి ఈదర విజయభాను, జిల్లా సహ



రిలే దీక్షలో ప్రభుత్వ ఉద్యోగులు

అధ్యక్షుడు మసూద్ అలీ, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, మార్కాపురం తాలూకా సెక్రటరీ బండి వెంకటేశ్వర్లు, కోశాధికారి బుడేసాహెబ్, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. **కంభంరూరల్ :** సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులంతా ఏకం కావాలని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక తహశీల్దారుకార్యాలయం ఎదుట ఎపిజిఇఎ కంభం తాలూకా యూనిట్ అధ్యక్షుడు సిహెచ్. సుబ్బారామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా సకాలంలో జీతాలు ఇచ్చేలా చట్టం చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఎపిజిఇఎ కంభం అధ్యక్షుడు సుబ్బారామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌తో సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో సమస్యల గురించి చర్చించి పరిష్కరించాలన్నారు. ఉదోగ్య విరమణ చేసిన ఉద్యోగులకు అదే రోజు ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఇఎ జిల్లా కోశాధికారి ఈదర విజయభాను, జిల్లా సహా అధ్యక్షుడు మసూద్ అలీ, ఒంగోలు టౌన్ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వి. రమణా రెడ్డి, కంభం తాలూకా సెక్రటరీ షేక్ హుస్సేన్ బాషా , ట్రెజరర్ డి. పీర్సా, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



బహుమతిని అందుకుంటున్న విజేతలు

క్రికెట్ విజేత మద్దిపాడు జట్టు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహిస్తున్న పాలడగు వెంకట్రావు మెమోరియల్ ఎంపిఎల్ టి-20 ఆహ్వాన క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ పోటీల్లో మద్దిపాడు ,విజయవాడ జట్లు తలపడ్డాయి. మద్దిపాడు జట్టు విజయం సాధించి లక్ష రూపాలయ నగదు బహుమతిని అందుకుంది. విజయవాడ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.60 వేల నగదు బహుమతిని కైవశం చేసుకుంది. విజేతలకు వైసిపి గుంటూరు యువజన నాయకులు కల్లం హరినాథ్‌రెడ్డి, గుంటూరు సోషల్ మీడియా ఇన్‌ఛార్జి బాబుల్ తుమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం క్రికెట్ పోటీల నిర్వాహకులు పాలడగు రాజీవ్, మైనిక దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలడగు సందీప్, గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, సురేష్, రవి, మురళీకష్ణ, లక్ష్మినారాయణ తదితరలు పాల్గొన్నారు



శంకుస్థాపనలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఒంగోలు సబర్బన్ : స్థానిక 19వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పలు రోడ్లు, కల్వర్టులు, కాల్వలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత హౌసింగ్ బోర్డు కాలనీ పాలిటెక్నిక్ కాలేజి రోడ్డులో రూ.19.05 లక్షలతో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కాలనీ పాలిటెక్నిక్ కాలేజీకి పడమరవైపున ఓల్డ్ బైపాస్ వద్ద రూ.22.30 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సాయిబాబా గుడి దగ్గర నుంచి విఆర్ రెసిడెన్సీ మీదుగా ఓల్డ్ బైపాస్ వరకూ రూ.35.60 లక్షలతో బిటిరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు, కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

శింగరాయకొండ : మండల పరిధిలోని పాత శింగరాయకొండ అయ్యప్ప నగర్ దగ్గర రైల్వే గేటు మూతవేత వేస్తున్న నేపథ్యంలో రాకపోకలకు ప్రత్యాన్నాయ మార్గం చూపాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని పాత శింగరాయకొండ, అయ్యప్ప నగర్ గ్రామస్తులు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అయ్యప్ప నగర్- పాత శింగరాయకొండ మధ్య గత కొన్ని సంవత్సరాలుగా రైల్వే గేటు ఉందన్నారు. దీంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. రైల్వే మూడో లైన్స్ నిర్మాణంలో రైల్వే గేటు మూత వేస్తున్నట్లు తెలిపారు. దీంతో అయ్యప్ప నగర్ నుంచి పాత శింగరాయకొండ వెళ్లాంటే ఇబ్బందులు తప్పవని తెలిపారు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాత శింగరాయకొండ, అయ్యప్ప నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి- కొమరోలు

పదో తరగతి పరీక్షల్లో ఉత్తతమ మార్కులు సాధించిన ప్రాథమిక ఎస్‌బిఎన్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం అభినందించి ప్రతిభా అవార్డులు అందజేశారు. డివి. కార్తిక్ 568/600 ఇ.సాయి 564/600, ఎం. ధరణి కుమార్ 561/600, ఎస్. శైలజ 553/ 600, కె. శ్రీనివాసులు 523/600, డివి. కారిక్త్ 502/600 మార్కులు సాధించారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభ అవార్డులు అందజేసి అందించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బివి.సుబ్బారెడ్డి, రేవతి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పొదిలి : పొదిలి పెద్ద బస్టాండ్ సెంటర్‌లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు గునుపూడి భాస్కర్ గునుపూడి సుబ్బారావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ జడ్‌పిటిసి కాటూరి వెంకటనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కాటూరి నారాయణ ప్రతాప్ , టిడిపి నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, శామంతపూడి నాగేశ్వరరావు, మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా ఖుర్దూస్, కల్లూరి సోమయ్య, షెహనాజ్, జ్యోతి మల్లికార్జునరావు పాల్గొన్నారు. **పొదిలి :** పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక ప్రభుత్వ బాలికల బిసి వసతి గృహానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభా అవార్డులు అందుకున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో వెలుగు ప్రత్యూష, సురేఖ ఉత్తమ ప్రతిభా అవార్డులు అందుకున్నట్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మర్రిపూడి ఎంఇఒ రంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఎంఇఒ రంగయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజావక్తి - నాగులుప్పలపాడు

మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంపిపి నలమలపు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిఎం రవికుమార్ మాట్లా డుతూ రైతులకు పంటకాలువలు నిర్మించుకొనేందుకు ఉపాధి పథకంలో అవకాశం ఉందన్నారు. రైతులకు అవసరమైన పనులు ఉపాధి పథకం ద్వారా చేపట్టాలని ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారు బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయకుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాఘవేంద్ర, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పత్రాలు అందజేత

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

చుక్కల భూముల రైతుల కష్టాలు తీరినట్లేనని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో 29 మంది రైతులకు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మంగళవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు విజయ్ కుమారి ,డిటీ ప్రసాదు, జడ్‌పిటిసి సారే వెంకట నాయుడు ,వైసిపి నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

యల్లయ్యకు ఎమ్మెల్యే బుర్రా నివాళి

ప్రజాశక్తి - పిసిపల్లి

మండల పరిధిలోని వెంగళాయపల్లి గ్రామానికి చెందిన అత్యాల యల్లయ్య(75) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మంగళవారం యల్లయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. యల్లయ్య మృతి వైసిపికి తీరని లోటని తెలిపారు. యల్లయ్యకు నివాళులర్పించిన వారిలో ఎంపిపి అత్యాల జఘన్య, పిసిపల్లి సొసైటీ చైర్మన్ పోలు జయరామిరెడ్డి, గృహసారధుల మండల కన్వీనర్ శీలం సుదర్శనం, ఏరువ నరసింహం, బొమ్ము దత్తాత్రేయరెడ్డి, ఒకేరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైసిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-మార్కాపురం

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైసిపి పట్టణ కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో వైసిపి శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. తొలుత దివంగత సిఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు, మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దూదేకుల నాగుర్‌వలి, శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ పెనుగొండ కేశవరావు, మున్సిపల్ కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, కశ్శెట్టి నగేష్‌కుమార్, మంగమూరి శ్రీనివాసులు, దూదేకుల ప్రసాద్, డి.హర్షితబాబి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, పఠాన్ అమీరుల్లాఖాన్, వైసిపి పట్టణ ప్రచార కమిటీ చైర్మన్ మయూరి ఖాశిం, వైసిపి నాయకులు ముత్తారెడ్డి వెంకటరెడ్డి, షేక్‌షెక్షావలి, మల్లాపురం ఉత్తమ్‌కుమార్, వెంకటరెడ్డి, రోజ్‌లిడియా పాల్గొన్నారు. **దర్శి :** వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ క్యాంపు కార్యాలయంలో కేట్ కట్ చేశారు. అనంతరం గడియార స్తంభం సెంటర్ వరకూ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వైవి. సుబ్బయ్య, వైసిపి మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్ విసిరెడ్డి, నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గోళ్లపాటి అచ్చయ్య, బండి గోపాల్, చంద్రశేఖర్, మిల్లర్ బుజ్జి, భాస్కరరెడ్డి, హరీష్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మండలంలోని గుమ్మళంపాడు గ్రామ సచివాలయం వద్ద కేక్ ను కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఎంపిపి విజయ, జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, సొసైటీ చైర్‌పర్సన్లు దుంపా యలమందారెడ్డి, బొక్కిసం



యర్రగొండపాలెంలో బైకు ర్యాలీలో మంత్రి సురేష్



దర్శిలో బైకు ర్యాలీలో ఎమ్మెల్యే మద్దిశెట్టి

శివరామయ్య గ్రామ సర్పంచి షేక్ పాశ్చాసాహెబ్, కార్యదర్శి ఎన్ ప్రతాప్ కుమార్, నాయకులు కత్తినేని శ్రీనివాసరెడ్డి, నూకతోటి ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల పరిధిలోని నిడమానూరు వైసిపి నాయకుడు పులిచర్ల పరంధామిరెడ్డి ఆధ్వర్యంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి నల్లమలపు అంజమ్మ కష్ణారెడ్డి సంబరాలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమంలో నిడమానూరు సర్పంచి వడ్డి ముక్కల శ్రీను, ఉపసర్పంచ్ గంగ్ర రమణారెడ్డి, వైస్ ఎంపిపి మల్లెల జాన్సన్,సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి,సితారెడ్డి, హరిబాబు, రాష్ట్రడైరెక్టర్లు కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు. **పొదిలి :** రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్‌లో వైసిపి నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, నాయకులు గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీను, గూడూరి వినోద్, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జాహన్ బేగం, పులగొర్ల శ్రీనివాసులు, మల్లాపురం చిననరసింహాలు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి.సుబ్బారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, పాలిరెడ్డి, పోలిరెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గం కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** పేదల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిఎంగా జగన్మోహన్‌రెడ్డి నాగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, వైసిపి మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, నాయకులు పునుగోటి కొండారెడ్డి, దిబ్బారెడ్డి, యక్కంటి తిరుపతిరెడ్డి, వివి.రమణారెడ్డి, పెద్దవెంకటరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, కోటేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వర్లు, శిగినం కొండయ్య, మందలపు శ్రీను, చెరుకూరి నారాయణ, పాలిరెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

వెలిగండ్ల : మండల పరిధిలోని మొగులూరు పల్లిలో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం, పిడుగు పాటుతో గొర్రెలు, మేకలు, గేదె చనిపోవడంతో నష్టపోయిన రైతు రాయ గురుబ్రహ్మయ్యకు నష్టపరిహారం అందించాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా వృత్తిదారుల సంఘం నాయకులు కండె బాలకష్ణ, రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలు, గేదె చనిపోవడంతో రెండు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పిడుగు పాటుకు మృతిచెందిన గొర్రెలు, మేకలు, గేదెలను వెటర్నరీ డాక్టర్ హనుమాన్‌సాహెబ్ , ప్రజా సంఘాల నాయకలు మంగళవారం పరిశీలించారు. అనంతరం బాధితుడు రాయ గురు బ్రహ్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంటాన్ని ఆదుకోవాలని వెటర్నరీ డాక్టర్, మండల తహశీల్దారుకు విన్నవించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమాన్‌సాహెబ్, తహశీల్దారు చిలకల నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సమస్యలను పై అధికారులు దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ హాస్పటల్ సిబ్బంది నరేంద్ర, సతీష్, రమణయ్య, గ్రామస్తులు రాయ సిద్ధయ్య, మద్దిరాల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మృతి చెందిన జీవాలను పరిశీలిస్తున్న నాయకులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

కొమరోలు : తాగునీటి సమస్యను పరిష్కరిం చాలని కోరుతూ మండల పరిధిలోని గోపాలునిపల్లె ఎస్‌సి కాలనీ వాసులు కొమరోలు గ్రామ సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ తాగునీటి కోసంతీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పేదలు అయిన తాము నీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరిం చాలని కోరారు. అనంతరం సచివాలయం కార్యదర్శి సురేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-కొండపి

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు రామజమంత్రి నిర్వహించిన మహానాడులో విడుదల చేసి టిడిపి మేనిఫెస్టోను హర్షిస్తూ చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా నాయకులు రావిపాటి సీతమ్మ, టిడిపి మండల మహిళా అద్యక్షులు బొద్దులూరి ప్రసన్న లక్ష్మి, మాజీ ఎంపిపి దేపూరి రత్తమ్మ,కొత్త మంగమ్మ, ఈదర ప్రశాంతి, అనకర్లపూడి రత్తమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు బి.యలమందనాయుడు, బత్తుల నారాయణ స్వామి, నరసారెడ్డి పాల్గొన్నారు. **శింగరాయకొండ :** టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహిం చారు. రాజమండ్రిలో నిర్వహించిన మహానాడులో టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించడాన్ని హర్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యాటగిరి శోభారాణి , మాజీ వైస్ ఎంపీపీ కూనపురెడ్డి, వెంకట హైమావతి, మాజీ జడ్‌పిటిసి పొనుగోటి ఎస్తేరమ్మ , వేల్పుల కోటేశ్వరమ్మ , సుదర్శి ప్రసన్న రసూల్ , ఝాన్సీ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన మూలంరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ఢిల్లీలోని శాస్త్రిభవన్‌లో కేంద్రపర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఎపి రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు మూలంరెడ్డి అంజలీప్రసాద్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మునికుమార్ యాదవ్ ఉన్నారు.

తప్పులు మీవి.. నిందలు మాకా?: ఛైర్మన్

- కొందరు అధికారుల అవినీతితో మున్సిపాలిటీకి చెడ్డపేరు వస్తోందని వ్యాఖ్య
- ప్రజాశక్తి వార్తకు స్పందించిన మునిసిపల్ కౌన్సిలర్లు
- ఫ్రైడే స్కూల్‌కు రూ.10 లక్షల పైప్‌లైన్ అంశం వాయిదా
- ఆక్రమణలో ఉన్న మూడు షాపుల తొలగింపునకు పాలకవర్గం రంగం సిద్ధం

ప్రజాశక్తి-చీరాల

వ్యక్తుల ప్రయోజనాల కోసం కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతూ చీరాల పురపాలక సంఘం పాలకవర్గానికి చెడ్డపేరు తీసుకు వస్తున్నారని, సొంత పార్టీ నాయకులైన సరే వారి తప్పుడు పనులకు అధికారులు సహకరిస్తే ఉపేక్షించేది లేదని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు కౌన్సిల్ సమావేశంలో అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మొదటి మూడు అంశాలు వాయిదా పడగా నవ్య కేబుల్ షాపింగ్ కాంప్లెక్స్ అంశం మాత్రం షాపులను బహిరంగ వేలంపాట నిర్వహించాలని కౌన్సిలర్లు తీర్మానించి ఆ అంశాన్ని రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ప్రజల సొమ్ము పాలకవర్గం దుర్వినియోగం చేస్తోందని, కార్పొరేట్ ఫ్రైడ్ పాఠశాలకు రూ.10 లక్షల వ్యయంతో పైపులైను ఏర్పాటు చేసేందుకు అజెండాలో పొందుపరిచిన అంశం గురించి ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం "ఫ్రైడ్‌కు రూ.10 లక్షలతో పైపులైన్" అనే శీర్షికతో వచ్చిన కథనానికి కౌన్సిలర్లు స్పందించారు. సమావేశంలో కో ఆప్షన్ మెంబర్ కబీర్ కార్పొరేట్ స్కూలుకు రూ.10 లక్షల ప్రజల సొమ్మును వెచ్చించడం సరైనది కాదని, వేలుకు వేలు ఫీజులు కట్టించుకుంటున్న స్కూలుకు అవసరమైన పైప్‌లైన్ నిధులు యాజమాన్యమే భరించాలని అన్నారు. ఈ అంశాన్ని ఐదవ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి, గుంటూరు ప్రభాకర్‌రావు, తోకల అనిల్ పలువురు కౌన్సిలర్లు బలపరిచారు. దీంతో ఆ అంశం వాయిదా పడింది. మొత్తంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగానే ముగిసినప్పటికీ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తితో పలు అంశాలను లేవనెత్తారు. చీరాల మున్సిపాలిటీలో వ్యక్తుల ప్రయోజనాల కన్నా ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఆ దిశగానే మునిసిపల్ కౌన్సిలర్లు అందరూ పనిచేస్తున్నారన్న సంగతి అందరూ తెలుసుకోవాలని అన్నారు. తనకు సంబంధం లేని విషయాలలో తన ప్రమేయం లేకుండానే జరిగిన పనులలో తనపై సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు జరిగాయని, అవి తనకు ఎంతో బాధను కలిగించాయని, కౌన్సిల్ సమావేశంలో ఆయన ఆవేదన చెందారు. తన రాజకీయ, రియల్ ఎస్టేట్, వ్యాపార రంగంలో, ఎంతో మంచి పేరు తెచ్చుకున్నప్పటికీ అవినీతి అధికారుల వల్ల తాను అవమానపడవలసి వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పొలిమేర రోడ్డులో ఆక్రమణకు గురైన మూడు షాపులు తొలగింపుకు ఈపాటికి దుకాణ పనులు రద్దు చేశామని, విద్యుత్ అధికారులను కూడా మీటర్ తొలగించాలని నోటీసులు పంపించినట్లు తెలిపారు. ఈ తరుణంలో త్వరలోనే షాపులను తొలగించేందుకు రంగం సిద్ధమైనట్లు తేల్చి చెప్పారు. వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడుతూ మసీదు సమీపంలో కల్వర్టు వద్ద కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. 5వ వార్డులో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి వాటిని తొలగించాలని ఆ వార్డు కౌన్సిలర్ సూరగాని లక్ష్మి ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కరణం వెంకటేష్

ప్రజా సమస్యలు చర్చించే సమావేశాల్లో పాల్గొంటా: ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్

మున్సిపల్ కార్యాలయంలో, మండల పరిషత్, తహశీల్దారు కార్యాలయాల్లో జరిగే అన్ని సమావేశాల్లో తాను పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. వైసిపి ఇన్‌ఛార్జిగా తాను ఆయా కార్యక్రమాలలో అధికారికంగానే పాల్గొని వాటిని ప్రజాప్రతినిధులతో అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. సమావేశాలలో పాల్గొనే విషయంలో ఎవరికీ ఎలాంటి అపోహలు అవసరం లేదని, నేరుగా తానే పాల్గొంటూ సమస్యలు పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.


నరేంద్ర కుమార్‌ను అభినందిస్తున్న మంత్రి మేరుగ

ఎంపీపీల సంఘం అధ్యక్షులుగా నరేంద్ర

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లా ఎంపీపీల సంఘం నూతన అధ్యక్షులుగా అమర్తలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్ ఎంపికయ్యారు. మంగళవారం బాపట్ల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన జిల్లా ఎంపీపీల సమావేశంలో రాపర్ల జిల్లా నూతన ఎంపీపీల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీల జిల్లా నూతన అధ్యక్షులు నరేంద్రకుమార్‌కు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మేరుగ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి గెలిపించుకోవడం కోసం రాష్ట్రంలోని ఎంపీపీలందరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. అనంతరం జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్ష, కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అమర్తలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్ బాపట్ల జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షురాలిగా మార్టూరు ఎంపీపీ శ్రీమతి భూక్యా శాంతి భాయి, జిల్లా ఉపాధ్యక్షురాలుగా బల్లికురవ ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, మరో జిల్లా ఉపాధ్యక్షురాలుగా భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్లపాలెం ఎంపీపీ యారం వనజ, జిల్లా అధికార ప్రతినిధిగా రేపల్లె ఎంపీపీ పెనుమాల సుశీల, జిల్లా కార్యదర్శిగా ఇంకొల్లు ఎంపీపీ బండారు అనూష, ఎంపీపీల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా చుండూరు ఎంపీపీ జాలాది రూబెన్, బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబులు ఏకగ్రీవంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీల సంఘం బలోపేతానికి చేయాలని పలువురు ఎంపీపీలు ఈ సందర్భంగా తీరుతున్నారు. రాష్ట్ర ఎంపీపీల నూతన సంఘం ప్రతినిధులను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సామూహిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఏపిజెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి మంగళవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సామూహిక నిరాహారదీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి 83 రోజుల నుంచి ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని అన్నారు. ప్రతి నెలా 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలని, అయితే అలా ఇవ్వడం లేదని వాపోయారు. 1.7.2018, 1.1.2019, 1.7.2019, 1.7.2021 పెండింగ్‌లో ఉన్న 4 డీఏ అరియర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి కమిషన్ సిఫార్సు చేసిన పేస్కేల్స్ వెంటనే విడుదల చేయాలని అన్నారు. పీఆర్‌సీ అరియర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 2 డీఏలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రకటించినట్లుగా సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి ఓపిఎస్‌లోకి మార్చాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఏ లకు సంబంధించిన ప్రధాన సమస్యలు వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసి అమరావతి బాపట్ల జిల్లా ఛైర్మన్ సిహెచ్ సురేష్ బాబు, జనరల్ సెక్రటరీ టి రజనీకాంత్, జిల్లా కో ఛైర్మన్ వై శ్రీనివాసరావు, ఏపిఆర్ఎస్ఏ సిటీ యూనిట్ ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ సంఘ నాయకులు, విఆర్‌ఏ సంఘ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, ఆర్‌టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నమైన ఆలోచనలు చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహిళా సాధికారత కోసం పొదుపు మహిళలకు విస్తతంగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా చెప్పారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. పొదుపు మహిళల జీవితాలను మార్చడానికి అధికారులు వినూత్నమైన ఆలోచనలతో కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టరు తెలిపారు. బాపట్ల జిల్లాలో 33,760 స్వయం సహాయక సంఘాలు మనుగడలో ఉన్నాయన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9 ప్రభుత్వ శాఖలు అనుబంధంగా 1,19,108 మంది మహిళలకు రూ.1,495.97 కోట్ల రుణాలు ఇవ్వాలని వార్షిక ప్రణాళిక రూపొందించామన్నారు. స్థానిక పరిస్థితులు, వనరుల ఆధారంగా స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా రుణసదుపాయం కల్పించాలన్నారు. పంపిణీ చేసిన రుణాలతో జీవనోపాధి పొందడమే గాకుండా నిరుపేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మారిపోవాలన్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలైన ఎస్‌సి, ఎస్‌టిలు, దివ్యాంగులు ఉండేలా చూడాలన్నారు. వారి జీవితాలు మారాలంటే రుణపరిమితులు లేకుండా యూనిట్లు మంజూరు చేయాలన్నారు. ఇందుకోసం బ్యాంకర్లు తమ సహాయ సహకారాలు అందించాలన్నారు. అనుబంధ శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలతోపాటు అద్భుతాలు సృష్టించవచ్చని అన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ బి అర్జున్ రావు, ఎల్‌డిఎం శివరామకృష్ణ, పరిశ్రమల శాఖ జిఎం మదన్ మోహన్, మత్స్యశాఖ జెడి పి సురేష్, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, ఏపీఎంఐపి వి రమణ అధికారులు పాల్గొన్నారు.


సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టరు రంజిత్ బాషా

కుందేరును సక్రమంగా కొలవాలి: పాలేటి

ప్రజాశక్తి-చీరాల

కుందేరు స్థలం అన్యాక్రాంతం కాకుండా అధికారులు దృష్టి సారించాలని మాజీ మంత్రి పాలేటి రామారావు అన్నారు. ఇటీవల కొత్తపేట కుందేరు ప్రాంతంలో నిర్మాణాలు చేపడుతున్నందున వాటిపై మంగళవారం డ్రైనేజ్ అధికారులు ఈఇ మురళీకృష్ణ, డిఇ సుబ్బారావులను పాలేటితో పాటు కుందేరు అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కటకం శ్రీనివాసరావు కలసి మాట్లాడారు. కుందేరు స్థలంలో జరుగుతున్న ఆక్రమణలు, నిర్మాణాలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో వెదుళ్లపల్లి నుంచి చినగంజాం వరకు కుందేరు ప్రాంతం ఉందని, దీని ద్వారా మురుగు, వర్షపునీరు కలసి సముద్రంలో కలుస్తుందన్నారు. కుందేరులో పూడిక సక్రమంగా అంటే వర్షాకాలంలో కూడా నీరు సక్రమంగా ప్రవహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. స్థానిక కొత్తపేట పరిధిలో ఉన్న కుందేరు ప్రాంతంలో ఇటీవల డ్రైనేజ్ పంచాయతీ అధికారులు కలసి నిర్మాణాలను చేపడుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ నిత్యం కుందేరులో నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కుందేరు స్థలాన్ని పరిరక్షించకుంటే తాను ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమేనని చెప్పారు.

వైసిపి జెండా ఎగరవేయాలి: కరణం

ప్రజాశక్తి-చీరాల

చీరాల నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేయాలని, ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ ఛైర్మన్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అనేక పథకాలు ప్రవేశపెట్టి పేద మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా వారి అభివృద్ధికి కృషి చేసిన ఘనత వైసిపిది అన్నారు. తాము వైసిపిలోకి వచ్చినప్పటి నుంచి చీరాల నియోజకవర్గ ప్రజలందరినీ ప్రశాంత వాతావరణంలో ఉంచుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, రామసుబ్బులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోనను విమర్శించడం తగదు

ప్రజాశక్తి-బాపట్ల: బాపట్ల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతిని విమర్శించడం తగదని వైసిపి పట్టణ నాయకుడు జోగి రాజా అన్నారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేసిన నరేంద్రవర్మ ఎమ్మెల్యే కోన రఘుపతిపై చేసిన వ్యాఖ్యలపై రాజా విరుచుకుపడ్డారు. మంగళవారం వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పాలన సందర్భంగా కోన ఛాంబర్ వద్ద జరిగిన కార్యకర్తలు వైసిపి అభిమానులకు అభినందనలు తెలుపుతూ పట్టణ పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు నేతృత్వంలో భారీ కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జోగి రాజా, గవిని కృష్ణమూర్తి, చేజర్ల నారాయణరెడ్డి, బుల్లిరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన కొమ్మాలపాటి రమేష్ కుమారుడు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ కార్తిక్(17) ఇటీవల మృతి చెందగా మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కార్తీక్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా కొమ్మినేనివారిపాలెం గ్రామంలోనే చింతల హనుమంతరావు ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకోగా వారిని పరామర్శించి ఆరోగ్య విషయమై వివరాలు తెలుసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన కుందుర్తి రాజేష్ కిడ్నీ సమస్యతో బాధపడుతుండటంతో వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏల్చూరి శ్రీనివాసరావు, కొమ్మినేని బాబురావు, కొమ్మినేని అంజిబాబు, దివ్య రాధాకష్ణ, గోగినేని సతీష్ బాబు పాల్గొన్నారు.

జగన్ పరిపాలనపై ప్రజలు సంతృప్తి

వైసిపి నేత, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జగన్మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు తెలిపారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించడంలో రాజీ పడలేదని, కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా చూశారన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు సంతప్తి వ్యక్త పరుస్తూ, అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి శిద్ధా రాఘవరావు అభినంద నలు తెలిపారు. 2019 ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను దాదాపుగా ఈ నాలుగేళ్ళ పాలనా కాలంలో అమలు చేసిన జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సష్టించారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను కచ్చితంగా అమలుచేస్తున్న సాహసం దేశంలో జగన్ ఒక్కరికి మాత్రమే ఉందన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 మంది ఎస్సి, ఎస్టి, బిసిలకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారని, కొందరు అట్టడుగు వర్గంలోని వారు ఉన్నార న్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆ పదవులు కూడా ఇచ్చారని, ఆనాడు జనం జగన్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని ఆయన నిలబెట్టుకున్నారన్నారు. పాదయాత్రలో వచ్చిన సమస్యలన్నీ విని మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. పరిపాలనను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లడం, రైతులకు అవసరమైన పథకాలను పొలం గట్టు దాకా తీసుకెళ్లిన ఘనత సిఎం జగన్‌దేనని తెలి పారు. మాటలు చెప్పి కాలం గడిపే చంద్ర బాబు లాంటి మనిషి జగన్ కాదని, ఆయన చేతల మనిషి అని కొనియాడారు. ఎన్నడూ, ఎవరూ ఆలోచన చేయని విధంగా జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తూ, సంక్షేమ పథకాల లబ్ధి ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుం డా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తు న్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల సం క్షేమం, అన్ని ప్రాంతాలను అభివద్ధి చేస్తూ, ప్రజా రంజక పాలనను అందిస్తున్నారన్నారు. జగన్మో హన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం దేశంలోనే ప్రధమ స్థానంలో ఉందన్నారు. జగ న్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 4 సంవత్సరాల కాలంలో ఎన్నో అవాంతరాలను, ఒడిదుడుకు లను ఎదుర్కొన్నా, ప్రజలకు సంక్షేమ పాలన అందించడంలో రాజీ పడలేదన్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

మంత్రి సురేష్

ప్రజాశక్తి- యర్రగొండపాలెం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడును రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్ళ పూర్తయిన సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ శకానికి నాంది పలికారని తెలిపారు. ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాలు పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు బూటకపు మాటలు, అబద్ధపు మాటలు చెప్పి డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక అక్క చెల్లెమ్మలను విస్మరించారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు నిరుద్యోగభతి ఇస్తానని డ్రామా చేశాడని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి.సుబ్బారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, పాలిరెడ్డి, పోలిరెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గం కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం మండలంలోని గంగపాలెం గ్రామంలో మంగళవారం పర్యటించిన మంత్రి సురేష్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, యర్రగొండపాలెం సర్పంచ్ రామావత్ అరుణాబాయి, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గం కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, వైసిపి నాయకులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వినూత్నకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

జాతీయ స్థాయిలో సివిల్ సర్వీస్‌కు ఎంపిక అయిన ఒంగోలుకు చెందిన యువతి బొల్లిపల్లి వినూత్నను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అభినందించారు. మంగళవారం ఉదయం ప్రకాశం భవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ను వినూత్న మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు 462 ర్యాంక్ వచ్చిందని, ఐఎఎస్ వస్తుందని ఆమె వివరించారు. ఈ సందర్భంగా వినూత్నను కలెక్టర్ అభినందించి మంచి సివిల్ సర్వెంట్‌గా పేరు తెచ్చుకోవాలని ఆమెకు సూచించారు. అదేవిధంగా వినూత్నను జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఏపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రవీంద్ర బాబు, జిల్లా ఉద్యాన అధికారి యుగంధర్ పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందిచారు. కలెక్టర్‌ను కలిసినవారిలో వినూత్నతోపాటు ఆమె తల్లిదండ్రులు సుభాషిణి, బి.రవి, మేనమామ రవీంద్రనాథ్ ఠాగూర్. కుటుంబ సభ్యులు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.



వినూత్నను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలులో భారీ వర్షం

- నీటమునిగిన రహదారులు
- బయటపడ్డ డ్రైనేజీ డొల్లతనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, ఒంగోలు సబర్బన్

గత వారం రోజులుగా రోహిణి కార్తె ఎండలతో అల్లాడుతున్న ఒంగోలు నగర ప్రజలు మంగళవారం ఉపశమం పొం దారు. భారీ ఉరుములు, మెరుపులతో మంగళవారం మధ్యాహ్నం ఒంగోలులో భారీ వర్షం కురిసింది. ఎడ తెరిపిలేకుండా గంట పాటు కురిసిన భారీ వర్షానికి ఒం గోలు నగరంలోని ప్రధాన రహదారులన్ని జలమయమయ్యాయి. కాల్వలు పొంగి పొర్లాయి. భారీ ఈదురు గాలులకు హాస్పిటల్ హోర్డింగ్స్, నేమ్ ప్లేట్స్ ఎగిరిపడ్డాయి.



బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

దాదాపు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి నగరంలోని చాలా చోట్ల రహదారులు నీటి చెరువులను తలపిం చాయి. ప్రధానంగా కర్నూలు రోడ్డు, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఏరియా, భాగ్యనగర్, రిమ్స్, ఆర్టీసి డిపో, లాయర్‌పేట సాయిబాబాగుడి ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు చేరింది. కాల్వలు పొంగి వర్షపు నీరు, మురుగునీరు రోడ్లమీద గంటల తరబడి ప్రవహించింది. వాహనాల రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. కూరగాయల మార్కెట్ నీట మునిగింది. కొన్ని చోట్ల చెట్లు విరిగిపడటం, కరెంటు తీగలు తెగిపడటంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడిం ది. రెండు గంటల వర్షానికే నగరంలోని ప్రధాన రహదారులు నీట మునుగుతుం డటం నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థ డొల్లతనాన్ని తెలియజేస్తోంది. ప్రధాన రోడ్ల వెంట కాలువలను విస్తరించకపోవడం, అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నగరంలోని చిన్న వర్షం కురిసినా రహదారులు నీట మునిగే పరిస్థితులు దాపురించాయి. దీని మీద నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు దృష్టి పెట్టకపోవడం పట్ల నగర ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కర్నూల్‌రోడ్డులో నిలిచిన వర్షపునీరు

ఒక రోజు నీటి సరఫరా ఆలస్యం

నగరంలోని విద్యుత్తు సరఫరా కు అంతరాయం ఏర్పడటంతో నగరంలోని ఒక రోజు తాగునీరు ఆలస్యంగా సరఫరా చేయనున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు ప్రకటించారు. బుధవారం తాగునీరు సరఫరా కావాల్సిన ప్రాంతాలకు గురువారం సరఫరా చేస్తామని కమిషనర్ తెలిపారు.

మా ఫ్లెక్సీలను చించేసి..

మాపైనే దౌర్జన్యమా..: బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చించేసి తిరిగి తమపైనే దౌర్జన్యం చేస్తారా అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన నాయకులను ప్రశ్నించారు. జగన్ పాలనకు నాలుగేళ్ల పూర్తిఅయిన సందర్భంగా మంగళవారం జిల్లా వైసిపి కార్యాలయంలో సంబ రాలు చేసుకున్నారు. అనంతరం బాలినేని మీడియా తో మాట్లాడారు. తమ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించేసిన జనసేన నాయకులు తిరిగి తమమీదనే ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ఎప్పుడు ఎవరిమీద దౌర్జన్యం చేయ లేదని తెలిపారు. తన గురించి జిల్లా ప్రజలందరికి తెలుసని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఎక్కడా లేని గొడవ ఒంగోలులోనే జరిగిందని, ఇది మంచి పద్దతి కాదని జనసేన పార్టీ నాయకులను ఆయన హెచ్చరించారు.

ఆ ఘనత జగన్‌దే..

పాదయాత్రలో ఇచ్చిన హామీలలో 98శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందని పలువురు వైసిపి నేతలు పేర్కొన్నారు. జగన్‌పాలనకు నాలుగేళ్ల పూర్తిఅయిన సందర్భంగా మంగళవారం జిల్లా వైసిపి కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తరువాత కేక్ కత్తిరించి అందరికి పంచిపెట్టారు. 2014కు ముందు ప్రకటించిన మ్యానిపెస్టోను చంద్రబాబు నాయుడు అమలు చేసారా..?అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఈసందర్భంగా ప్రశ్నించారు. కార్యక్రమం అనంతరం మాతా శిశు వైద్యశాలలో మహిళలకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా ఛైర్మన్ శింగరాజు మీనా కుమారి, వైసిపి నాయకులు కటారి శంకర్, గోలి తిరుపతిరావు, తమ్మినేని మాధవి, గంటా రాము, బొట్లా సుబ్బారావు, పి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

చీమకుర్తి: జగన్ పాలనకు నాలుగేళ్ళ పూర్తిఅయిన సందర్భంగా చీమకుర్తిలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డితో కలిసి జిల్లాపరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కేక్ కట్ చేశారు.



చీమకుర్తిలో బూచేపల్లి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ